# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 29-11-2024 సమయం : సాయంకాలం 6 గం. 10ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు సచివాలయంలో విజన్ డాక్యుమెంట్ 2047పై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు.
- ❖ బియ్యం అక్రమ రవాణాను నివారించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఉపముఖ్యమంత్రి కె.పవన్‌కళ్యాణ్ అధికారులను ఆదేశించారు.
- ❖ పరిశ్రమల ఏర్పాటుకు పూర్తి ప్రోత్సాహకాలను అందిస్తామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు.
- ❖ మారుమూల గ్రామాల్లో రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి గుమ్మడి సంధ్యా రాణి తెలిపారు.
- ❖ బంగాళాఖాతంలో ఏర్పడ్డ తీవ్ర వాయుగుండం ప్రభావంతో దక్షిణ కోస్తాంధ్రలో ఈరోజు, రేపు భారీ వర్షాలు కురుస్తాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది.

==========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు సచివాలయంలో విజన్ డాక్యుమెంట్ పై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. 2047 నాటికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని దేశంలోనే మొదటి స్థానంలో నిలిపేందుకు ఉద్దేశించి ముఖ్యమంత్రి రూపొందిస్తున్న స్వర్ణాంధ్ర విజన్ 2047 డ్రాఫ్ట్ డాక్యుమెంట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టడం జరిగింది. నీతి ఆయోగ్ సహా పలు ప్రతిష్టాత్మక సంస్థల భాగస్వామ్యంతో విజన్ డాక్యుమెంట్ ను రూపొందిస్తున్నారు. అందరి అభిప్రాయాలను పరిశీలించి, పరిగణలోకి తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం... విజన్ డాక్యుమెంట్ ను త్వరలో విడుదల చేసేందుకు సిద్ధమైంది. ఈ సమీక్షలోప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్, వివిధ శాఖల కార్యదర్శులు, సీఎంఓ అధికారులు పాల్గొన్నారు.

==========================

బియ్యం అక్రమ రవాణాను నివారించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ కాకినాడ జిల్లా కలెక్టర్, ఇతర అధికారులను ఆదేశించారు. ఈరోజు ఆయన కాకినాడ పోర్టును సందర్శించి, ఇటీవల

బియ్యం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన నౌకను, ఒక వెయ్యి 64 టన్నులు బియ్యం సంచులను స్వయంగా పరిశీలించారు. పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కాకినాడ పోర్టు నుంచి బియ్యం అక్రమ రవాణా అంశాన్ని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. బియ్యం అక్రమ రవాణా కేసులో ఎవరు ఉన్నా కఠినంగా వ్యవహరించి చర్యలు తీసుకోవాలని ఉపముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

===========================

పరిశ్రమల ఏర్పాటుకు పూర్తి ప్రోత్సాహకాలను అందిస్తామని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఈరోజు ఆయన మంత్రి కొల్లు రవీంద్రతో కలిసి, విజయవాడ లో ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన "బిజినెస్ ఎక్స్‌పో"ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ... పరిశ్రమల ఏర్పాటుకు అనేక మంది ఉత్సాహం చూపుతున్నారని చెప్పారు. ప్రభుత్వ పరంగా చిన్న తరహా పరిశ్రమను ప్రోత్సహించే విధంగా బ్యాంకు నుంచి రుణాలను కూడా అందజేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి చెప్పిన "థింక్ గ్లోబల్ యాక్ట్ లోకల్" నినాదాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు. చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటు వల్ల ఉపాధి అవకాశాలు పెరుగుతాయని మంత్రి పేర్కొంటూ....

(వాయిస్ 26 సెకన్లు)

అనంతరం మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ... గత ప్రభుత్వం ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకోకపోవడంతో చాలా పరిశ్రమలు పక్క రాష్ట్రాలకు తరలిపోయాయని, వేలాది మంది ఉద్యోగాలు కోల్పోయారని అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పరిశ్రమల ఏర్పాటుకు ప్రత్యేక విధానాలను అమలు చేస్తోందని చెప్పారు.

===========================

డోలి మోతలు గల గ్రామాల్లో రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నామని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యా రాణి తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా పాచిపెంటలో 1.75 కోట్ల రూపాయలతో నిర్మించిన గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల అదనపు వసతి భవనాన్ని మంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... రహదారులు నిర్మించడం ద్వారా డోలి మోతలను నివారించాలని నిర్ణయించినట్టు తెలిపారు. రాష్ట్రంలో గిరిజన ప్రాంతాల్లో రెండు వేల రహదారుల నిర్మాణానికి 2 వేల 500 కోట్ల రూపాయలు మంజూరు చేయడం జరిగిందన్నారు. గిరిజన గ్రామాల్లోని ప్రజల కోసం గిరి వైద్య ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. వసతి గృహాల్లో విద్యార్థుల ఆహార మెనూలో మార్పులు తీసుకువస్తున్నామని తెలిపారు. విద్యార్థులు చదువు, క్రీడల్లో రాణించి, మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

===========================

నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడ్డ తీవ్ర వాయుగుండం పుదుచ్చేరికి 320 కిలోమీటర్లు, చెన్నైకి 340 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఇది వాయువ్య దిశగా కదులుతూ... రాగల 3 గంటల్లో తుపానుగా బలపడే అవకాశం ఉన్నట్టు రాష్ట్ర విపత్తుల నిర్వాహణ సంస్థ తెలియజేసింది. రేపు మధ్యాహ్నానికి ఉత్తర తమిళనాడు - పుదుచ్చేరి తీరాల సమీపంలో కారైకాల్ - మహాబలిపురం మధ్య పుదుచ్చేరికి సమీపంలో తుపానుగా తీరం దాటే అవకాశం ఉందని పేర్కొంది. దక్షిణ కోస్తాలో ఈరోజు, రేపు భారీ నుంచి అతి భారీ వర్షాలు, రేపు కొన్నిచోట్ల అతి తీవ్ర భారీ వర్షాలు కురవచ్చని తెలిపింది. రాష్ట్రంలో మిగిలిన చోట్ల తేలికపాటి నుండి ఓ మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని వివరించింది.

విరామం

===========================

పోలవరం ప్రాజెక్టును 45.72 మీటర్ల ఎత్తు వరకు నిర్మించి, నీటిని నిల్వ చేయడం జరుగుతుందని జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. ఈరోజు ఆయన సచివాలయంలో పాత్రికేయులతో మాట్లాడుతూ... పోలవరం ప్రాజెక్టు రాష్ట్ర ఆర్థిక సంపద పెరుగుదలకు ఆధార బిందువని, దీనిని వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని పేర్కొన్నారు. అదేవిధంగా... గోదావరి మిగులు జలాలను నదుల అనుసంధాన ప్రక్రియ ద్వారా ఉత్తరాంధ్ర, రాయలసీమలకు తరలిస్తామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలోని అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతంగా పూర్తి చేస్తామని మంత్రి తెలియజేశారు.

==========================

అనకాపల్లి జిల్లా నర్సీపట్నం - రేవు పోలవరం రహదారి పనులకు హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత... దార్లపూడి గ్రామం వద్ద ఈరోజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... నర్సీపట్నం - రేవు పోలవరం మధ్య రోడ్డు లేక ప్రజలు 5 సంవత్సరాలుగా ఇబ్బందులకు గురయ్యారని, పలుసార్లు రోడ్డు ప్రమాదాలు కూడా జరిగాయని అన్నారు. ఈ ప్రాంత ప్రజల సౌకర్యం కోసం 24 కోట్ల రూపాయల ఖర్చుతో రహదారి పనులకు శంకుస్థాపన చేశామని మంత్రి తెలిపారు. రోడ్లపై గుంతలు లేకుండా పనులు చేపట్టి సంక్రాంతి పండుగ నాటికి పూర్తి చేస్తామని చెప్పారు. త్వరలో ఇందేశమ్మవాక రోడ్డు కూడా పూర్తి చేస్తామని మంత్రి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

(వాయిస్ 23 సెకన్లు)

==========================

ఉత్తరాంధ్ర జిల్లాలలో రహదారులను అభివృద్ధి చేయాలని పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు... కేంద్ర రోడ్డు, రవాణా శాఖామంత్రి నితిన్ గడ్కరీని కోరారు. ఈ మేరకు ఆయన ఢిల్లీలో ఈరోజు కేంద్ర మంత్రిని కలిసి, ఉత్తరాంధ్ర ప్రాంతంలో రహదారుల అభివృద్ధి చాలా అవసరమని వివరించి, వినతిపత్రం అందజేశారు. శ్రీకాకుళం జిల్లా మీదుగా విస్తరించి ఉన్న జాతీయ రహదారి - 16 ను నరసన్నపేట - ఇచ్ఛాపురం మధ్య 6 లైన్లకు విస్తరించాలని, అలాగే... భోగాపురం ఎయిర్ పోర్టు నుంచి విశాఖపట్నం మధ్య రహదారికి అనుబంధంగా అప్రోచ్ రోడ్డు నిర్మించాలని కోరారు. కళింగపట్నం - శ్రీకాకుళం - పార్వతీపురం మధ్య ఉన్న సీఎస్పీ రోడ్డును జాతీయ రహదారిగా అప్ గ్రేడ్ చేయాలని విన్నవించారు. కాగా... దీనిపై నితిన్ గడ్కరీ సానుకూలంగా స్పందించారని ఎంపీ రామ్మోహన్ నాయుడు కార్యాలయం వెల్లడించింది.

==========================

ప్రకాశం జిల్లాలోని ఆక్వా రైతులు, మత్స్యకారుల సంక్షేమానికి కృషి చేస్తానని రాష్ట్ర మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య అన్నారు. మారిటైం బోర్డు ద్వారా జిల్లాలో చేపట్టవలసిన కార్యక్రమాల గురించి ఈరోజు ఆయన జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా, ఇతర అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా మత్స్య శాఖ అధికారులు జిల్లాలోని మత్స్య, ఆక్వా రంగాల గురించి వివరించారు. ఈ రంగాల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఇటీవల ముఖ్యమంత్రి రాష్ట్రంలో మారిటైం బోర్డు ద్వారా చేపట్టవలసిన కార్యక్రమాల గురించి సమీక్షించారన్నారు.

==========================

భారత పూర్వ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ కుటుంబ సభ్యులతో ఈరోజు అమరావతి లోని అమరేశ్వర ఆలయాన్ని సందర్శించారు. పూర్వ రాష్ట్రపతి దంపతులకు ఆలయ పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

==========================
==========================